క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ నియోజక వర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 18మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి పంపిణీ చేశారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల ఎమ్మెల్సీ కార్యాలయంలో సాగర్ నియోజకవర్గానికి చెందిన 18మంది అనారోగ్యానికి గురై వివిధ ఆస్పత్రిలో చికిత్స పొందారు. సీఎంఆర్‌ఫ్‌కు దరఖాస్తు చేసుకోగా వారికి మంజూరైన రూ.4,29,500 విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

త్రిపురారం : సీఎంఆర్ఎఫ్ చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని నిడమనూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంకతి సత్యం అన్నారు. బుధవారం నిడమనూరు మండలంలోని పార్వతిపురం, శాఖపురం గ్రామంలో సీఎంఆర్ఎఫ్ పథకంలో ద్వార మంజూరైన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాఖపురం మాజీ సర్పంచ్ చేకూరి వంశి, శ్రీనివాస్, దేవయ్య పాల్గొన్నారు.

నేడు సమావేశం

పెద్దవూర, వేములపల్లి(మాడ్గులపల్లి) : ఓటరు ముసాయిదా జాబితాపై అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో గురువారం తమ కార్యాలయాల్లో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు ఉమాదేవి, సంగీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అన్ని జీపీలలో ఓటరు ముసాయిదా జాబితాను ఇప్పటికే ప్రదర్శించినట్లు తెలిపారు. అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

డీఎస్పీ మండల కన్వీనర్‌గా నరేష్

త్రిపురారం : ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) త్రిపురారం మండల కన్వీనర్‌గా కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొమటిగూడెం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ నరేష్ నియమితులయ్యారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి తలారి రాంబాబు నరేష్‌కు నియామకపత్రం అందజేశారు. కోకన్వీనర్‌గా అన్నెపాక శ్రీకాంత్, బొల్లెంపల్లి నాగరాజు, కోశాధికారిగా బొల్లెపల్లి వెంకట్, కమిటీ సభ్యులుగా బాషిపాక శేఖర్ నియమితులయ్యారు. సమావేశంలో డీఎస్పీ జిల్లా కన్వీనర్ పొట్టిపాక శ్రీనివాస్, కోకన్వీనర్ వంగాల సతీష్ గౌడ్ పాల్గొన్నారు.

చింతపల్లి తహసీల్దార్‌గా రమాకాంత్ శర్మ



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

చింతపల్లి: చింతపల్లి మండల నూతన తహసీల్దార్‌గా బుధవారం రమాకాంత్ శర్మ బాధ్యతలు స్వీకరించారు. ఈయన యాదాద్రి జిల్లా సివిల్ సప్లయిస్ శాఖ నుంచి పదోన్నతిపై వచ్చారు. ఇక్కడ గతంలో పనిచేసిన విజయ్‌కుమార్ హైదరాబాద్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రమాకాంత్‌శర్మను నియమించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికి సన్మానించారు.

కొండమల్లేపల్లిలో ఫ్లెక్సీ వార్



ఇరువర్గాలను సముదాయిస్తున్న పోలీసులు

కొండమల్లేపల్లి : మండల మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు గురువారం జరగనున్న నేపథ్యంలో అభిమానులు కొండమల్లేపల్లి చౌరస్తాలో బుధవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా చిన్నఅడిశర్లపల్లి మాజీ సర్పంచ్‌తో పాటు మరికొందరు తమ ఫొటోలు లేవని చౌరస్తా సాగర్ రోడ్డు నుంచి డివైడర్ మధ్యలో కట్టిన ఫ్లెక్సీలను చించివేశారు. దీంతో మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి వర్గీయులు ఫ్లెక్సీ చించిన వర్గానికి మధ్య గలాట జరిగింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ రామ్మూర్తి ఇరువర్గాలను స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటనపై పార్టీకి సంబంధం లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమన్‌రెడ్డి తెలిపారు.

ప్రశంసాపత్రం అందజేత

మిర్యాలగూడ టౌన్ : ఇటీవల పట్టణానికి చెందిన కాకుల ధనలక్ష్మి మృతిచెందగా, నేత్రాలను డైమాండ్ నిధికి దానం చేశారు. డైమాండ్ నేత్ర నిధి సభ్యులు బుధవారం ఆమె కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌సీ పామ శ్రీనివాస్, ఐపీసీ మిట్టపల్లి విజయభాస్కర్‌రావు, సత్యనారాయణ, గట్టు వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

- మెజార్టీ గ్రామాల్లో కనిపించని ఎరువుల తయారీ
- సేకరించిన చెత్త పెంటపాలు
- అలంకార ప్రాయంగా కంపోస్టు షెడ్లు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



తిరుమలగిరి మండలం ఎల్లాపురంలో నిరుపయోగంగా ఉన్న కంపోస్టు షెడ్డు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : వర్మీ కంపోస్టు షెడ్లు అలంకార ప్రాయంగా మారాయి. రసాయ ఎరువులు వద్దు సహజసిద్ధమైన ఎరువులతో సాగును ప్రోత్సహిద్దామంటున్న సర్కారు లక్ష్యం నీరుగారుతోంది. ఫలితంగా పంచాయతీలకు వచ్చే ఆదాయం ఎలా ఉన్నా షెడ్ల కోసం వెచ్చించిన నిధులు వృథా అయ్యాయని పలువురు పేర్కొంటున్నారు. చెత్తలేక, ఎరువుల తయారీ కాక వర్మీకంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం లక్షల రూపాయలు వెచ్చించి ప్రతి పంచాయతీలో షెడ్లను నిర్మించింది. వాటిని వినియోగంలోకి తీసుకు రావడంలో మండల అధికారులు నిర్లక్ష్యం చేశారని విమర్శలు వస్తున్నాయి.

ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.2లక్షలు

తిరుమలగిరి మండలంలోని 34 పంచాయతీల్లో ఒక్కో షెడ్డుకు రూ.లక్షలు వెచ్చించి నిర్మించారు. పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులను తయారీ లక్ష్యంగా ఈ షెడ్లను ఏర్పాటు చేశారు. తడి, పొడి చెత్తను సేకరించి షెడ్లకు వచ్చిన తరువాత ప్లాస్టిక్ సీసాలతో పాటు ఇతర వస్తువులను వేరు చేయాల్సి ఉంటుంది. కానీ ఇది మండలంలో కొన్ని గ్రామాల్లో మాత్రమే ఈ ప్రక్రియ కొనసాగుతుంది. సుమారు 20 గ్రామపంచాయతీల్లో ఈ షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కూరగాయలు, ఇతర వ్యర్థాలతో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలి. దీనికి పంచాయతీ అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. సేంద్రియ ఎరువు తయారైన తర్వాత స్థానిక రైతులకు దీనిని విక్రయించి వచ్చిన నిధులు పంచాయతీ అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. అయినా మండలంలో ఎరువుల తయారీ చాలా గ్రామాల్లో కానరావడం లేదు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే ఈ షెడ్లు నిరుపయోగంగా మారాయని గ్రామస్తులంటున్నారు.

గ్రామాల్లో తయారు చేస్తున్నాం



మండలంలో చాలా గ్రామాల్లో కంపోస్టు షెడ్లలో ఎరువుల తయారీ జరుగుతుంది. కొన్ని గ్రామాల్లో జరగకుంటే వాటిని పర్యవేక్షించి వినియోగంలోకి తీసుకువస్తాం. తడి- పొడి చెత్తను వేరుచేసి ఎరువుగా మార్చడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుంది. ఈ ఎరువు రైతులు తన వ్యవసాయ భూముల్లో వాడుకోవడం ద్వారా సారవంతమవుతాయి.

– భిక్షంరాజు, ఇంచార్జ్ ఎంపీడీఓ, తిరుమలగిరి

పేరుకే తడి – పొడి

గ్రామ పంచాయతీల్లో తడి – పొడి చెత్త ఎక్కడా కనిపించడం లేదు. చెత్త సేకరణకు ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి మరి పంచాయతీలకు ట్రాక్టర్లను సమకూర్చింది. పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణ చేస్తున్నా దానిని ఎక్కడో గుంతల్లో పారబోసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా సేకరించిన చెత్తను ఎరువుల తయారీకి వినియోగించాలని ప్రజలు పేర్కొంటున్నారు.

బీసీ విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలి



బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న వివిధ సంఘాల నేతలు

హాలియా : పట్టణంలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్(ఎమ్మెస్ఎఫ్) జిల్లా ఇన్‌చార్జ్ ముదిగొండ వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రమావత్ శోభన్‌బాబు, ముదిగొండ మురళి, ధర్మ స్టూడెంట్ యూనియన్ జిల్లా కన్వీనర్ సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం పలు సంఘాల ఆధ్వర్యంలో ఆ సంఘం నేతలు బీసీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల్లో భోజనాన్ని, వంట గదిలోని కూరగాయలను పరిశీలించి, విద్యార్థినులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేసి నిత్యం ప్రిన్స్‌పాల్, ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘాల నాయకులు మేదరి శేఖర్, యడవెల్లి శ్రీనివాస్, శివనాయక్, రమేష్ సురేష్ మహారాజ్, సుభాష్, గోపి ఉన్నారు.

భోజనం ప్లేట్లు అందజేత



ప్లేట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : లయన్స్‌క్లబ్, దివ్యాంగుల చైతన్య జన సేన సంఘం ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడులోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో సింగు రాంబాబు, కోల సైదులు, బీఎం నాయుడు, పాఠశాల హెచ్ఎం, నర్సింహనాయక్, నోడల్ అధికారి మంగ్యానాయక్, శివరంజని, దోమలపల్లి నాగయ్య తదితరులున్నారు.

అవంతీపురంలో మహా అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు హరిబాబు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం అవంతీపురం ఎస్సీ కాలనీలోని గణేశ్ మండపం వద్ద అంబేద్కర్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని తహసీల్దారు హరిబాబు ప్రారంభించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు తహసీల్దార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ భాణావత్ సత్యనారాయణ, బాధలాపురం మాజీ సర్పంచ్ చిమట పద్మమధార్, మాజీ ఎంపీటీసీ పర్వతం లింగయ్య, సుధీర్‌బాబు, పద్మ, వీరయ్య, గువ్వ సైదులు పాల్గొన్నారు.

రాంనగర్ బంధం వద్ద..

మున్సిపాలిటీలోని రాంనగర్ బంధం నాల్గో వార్డులో కమిటీ హాల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి నాల్గో వార్డు కౌన్సిలర్ చల్లా నాగమ్మవెంకన్న, 5వ వార్డు కౌన్సిలర్ ముదిరెడ్డి నర్సిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ యూత్ సభ్యులు దేవులపల్లి శోభన్, దేవులపల్లి భాస్కర్, చిమట నాగరాజు, దేవులపల్లి సునిల్, పగిళ్ల సందీప్, మన్నెం శ్రీను, చెవుల రాంబాబు ఉన్నారు.

రిజిస్ట్రేషన్ ఆపాలని తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

వేములపల్లి(మాడ్గులపల్లి): అక్రమంగా భూమి పట్టా చేయించుకునేందుకు యత్నిస్తున్న వారి భూ రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేయాలని మాడ్గులపల్లి మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన రెడ్డపాక సుధాకర్, రెడ్డపాక వీరయ్య, రెడ్డపాక నాగయ్య బుధవారం తహసీల్దార్ పద్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన రెడ్డపాక సోమయ్య తమ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. ఆ భూమిని ప్రస్తుతం తన కుమారులకు రిజిస్ట్రేషన్ చేసేందుకు స్లాట్ బుకింగ్ చేశారని తెలిపారు. ఆ రిజిస్ట్రేషన్‌ను ఆపి న్యాయం చేయాలని వారు తహసీల్దార్‌ను కోరారు.

రూ.150కోట్ల నిధులు తెచ్చా.. అభివృద్ధి చూపిస్తా

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : 'లక్ష రూపాయల నిధులు తేనోడు ఎమ్మెల్యే అయ్యాడని 20 రోజుల క్రితం ఓ మాజీ ప్రజాప్రతినిధి అవహేళన చేశాడని.. ఇప్పుడు చూడరా బిడ్డా రూ.150 కోట్లు తెచ్చా' అంటూ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావుపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెచ్చిన నిధులతో మిర్యాలగూడలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తానని అన్నారు. బుధవారం మిర్యాలగూడలో జరిగిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ శంకుస్థాపన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల్లో మనస్పర్థలు ఉంటే మానుకోవాలన్నారు. ఐకమత్యంతో పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీ విషయాలను ప్రత్యర్థి పార్టీలకు చేరవేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేసులు నమోదు చేస్తాం

త్రిపురారం : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నిడమనూరు తహసీల్దార్ కృష్ణయ్య హెచ్చరించారు. బుధవారం నిడమనూరు మండలంలోని బొక్కమంతల పాడు వద్ద ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. నిడమనూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఫాంపాండ్స్‌పై రైతులకు అవగాహన కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న పీడీ శేఖర్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఫాంపాండ్స్‌పై సన్న, చిన్న కారు రైతులకు అవగాహన కల్పించాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అల్వాల గ్రామంలోని సంపదవనాలు, ప్లాంటేషన్, కంపోస్టుషెడ్డులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ మందిరంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రాఘవరావు, ఇంచార్జ్ ఎంపీడీఓ భిక్షంరాజు, మండల నోడల్ అధికారి కొనమంచిలి శ్రీనివాస్, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ శంకర్‌బాబు, ఏపీఓ శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌కు ఎంపిక

నాగార్జునసాగర్: హిల్‌కాలనీ సెయింట్‌జోసెఫ్ స్కూల్ విద్యార్థులు సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ కిరణ్‌కుమార్ తెలిపారు. నల్లగొండలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్‌లో సెయింట్ జోసెఫ్ స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చూపినట్లు తెలిపారు. వీరు త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న సౌత్‌జోన్ సెలక్షన్స్‌కి వెళ్తున్నట్లు తెలిపారు.

దాడి చేశారంటూ పోలీసులకు కార్యదర్శి ఫిర్యాదు

మిర్యాలగూడ టౌన్ : విధులు ముగించుకుని వస్తున్న తనపై దాడికి పాల్పడ్డారని ఓ పంచాయతీ కార్యదర్శి మంగళవారం రాత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిర్యాలగూడ మండల పరిధిలో జరిగిన ఈ ఘటనపై వివరాలు ఇలా ఉన్నాయి. వేములపల్లి మండలం రావులపెంట గ్రామ కార్యదర్శిగా పని చేస్తున్న కట్కూరి రాంరెడ్డి మంగళవారం సాయంత్రం వీధులు ముగించుకొని తడకమళ్ల గ్రామం నుంచి మిర్యాలగూడ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన గుండు సతీష్, పరశురాములు బైక్‌పై వచ్చి అసభ్యకరంగా బూతులు తిడుతూ, దాడికి పాల్పడ్డారు. ఈ సమయంలో తడకమళ్ల వైపు వస్తున్న జిల్లా శ్రీను, జిల్లా సైదులును గమనించి నిన్ను ఎప్పటికైనా చంపుతామని బెదిరిస్తూ నిందితులు పారిపోయారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. నిందితులపై చర్య తీసుకోవాలని కోరుతూ కామేపల్లి గ్రామస్తులు బుధవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. స్టేషన్‌లోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

రికార్డు ధర పలికిన గణనాథుని లడ్డూ



లడ్డూను వేలంపాటలో దక్కించుకున్న జక్కుల మున్నయ్యయాదవ్

చందంపేట : చందంపేట మండలంలో గణనాథుని లడ్డూ వేలం పాటలో రికార్డు ధర పలికింది. మండలంలోని ముడుదండ్ల గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథున్ని ప్రతిష్ఠించగా బుధవారం నిర్వహించిన లడ్డూ వేలంపాటలో గ్రామానికి చెందిన జక్కుల మున్నయ్యయాదవ్ రూ.2,06,116కు దక్కించుకున్నాడు.

మందలించారనేనా..?

- విద్యార్థుల అదృశ్యంపై బలపడుతున్న ఇదే అనుమానం
- సిబ్బంది తీరుపై కలత చెందామని లెటర్‌లో విద్యార్థుల ఆవేదన
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

దేవరకొండ: 'బిర్యాని ప్యాకెట్ అంటే తీసుకున్నాం.. అందులో మత్తు పానియం ఉందన్న విషయం మాకు తెలియదు.. తమను కావాలని కొందరు పాఠశాల సిబ్బంది మందలించడంతో కలత చెందాం.. విషయం మా తల్లిదండ్రులకు తెలిస్తే ఏమవుతుందోనని ఆందోళనగా అంది.. అందుకే పాఠశాల నుంచి వెళ్లిపోతున్నాం.. మా తప్పు ఏమైనా ఉంటే క్షమించండి' ఇదీ.. దేవరకొండ మండలం కొండభీమనపల్లి వద్ద గల తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో అదృశ్యమైన విద్యార్థులు లెటర్‌లో వెల్లడించిన తీరు. దీనిని పరిశీలించిన పోలీసువర్గాలు సైతం భయాందోళనలోనే విద్యార్థులు పారిపోయి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

వసతులు లేవని ఏడాది క్రితం..

ఇప్పటి వరకు కొండమల్లేపల్లి మండల పరిధిలో నిర్వహించిన తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలను అక్కడ వసతులు లేవన్న కారణంతో గత ఏడాది దేవరకొండ మండలం కొండభీమనపల్లి వద్ద గల అప్పటి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలోకి మార్చారు. ఈ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు నడుస్తున్నాయి. పాఠశాలలో మొత్తం 426మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు.

వచ్చిన వ్యక్తులు ఎవరు?

ఈనెల 16వ తేదీన పాఠశాల ప్రహరీ అవతలి వైపు నుంచి బిర్యాని అంటూ నల్లటి కవర్లు విసిరారు. వాటిని పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ముజీబ్, తౌఫిక్, రెహమాన్ ఓపెన్ చేసి చూడగా, అందులో మత్తుపానియం ప్యాకెట్లు ఉండగా పక్కన పడేశామని విద్యార్థులు రాసిన లెటర్‌లో పేర్కొన్నారు. అయితే, ఆ ప్యాకెట్లు పాఠశాలలోకి విసిన వ్యక్తులు ఎవరనేది తెలియదని, బిర్యాని ప్యాకెట్లు అని చెప్పి విసిరారని అదృశ్యమైన విద్యార్థులు తోటి విద్యార్థులకు తెలిపినట్లు తెలిసింది. పాఠశాలలో ఇలాంటి ఘటనలు ఇప్పటి వరకు చోటు చేసుకోలేదని తెలిసింది. ప్రహరీ సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలిస్తే విద్యార్థులు వెళ్లిన దృశ్యాలే రికార్డు అయ్యాయని, వచ్చిన వ్యక్తులు నమోదు కాలేదని తెలిసింది. వచ్చిన వారు ఎవరు..? బిర్యానీ ప్యాకెట్ అని మత్తుపానియాల పొట్లాలు ఎందుకు విసిరారు..? ఇది ఎంతకాలంగా కొనసాగుతుంది..? అనే విషయాలు తెలిస్తేనే కేసు చిక్కుముడి వీడే అవకాశాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం.

మా బిడ్డలను సుక్షితంగా అప్పగించండి

'మా బిడ్డలు తప్పు చేశారని తెలిస్తే తొలుత మాకు సమాచారం ఇవ్వాలి. ఎందుకు మందలించారు.. మా బిడ్డలను సురక్షితంగా అప్పగించండి' అంటూ పాఠశాల వద్దకు వచ్చిన అదృశ్యమైన విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విద్యార్థుల పట్ల పాఠశాల సిబ్బంది వ్యవహరించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఎలాంటి తప్పు చేయలేదని నమ్ముతున్నామని.. తిరిగి వచ్చేయాలని కంటతడి పెడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకున్నారు.

కాంగ్రెస్ హయాంలో గురుకుల పాఠశాలలు అధ్వానం



విద్యార్థులతో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

దేవరకొండ : కాంగ్రెస్ హయాంలో గురుకులాల పరిస్థితి అధ్వానంగా మారిందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అదృశ్యమైన విషయం తెలుసుకున్న ఆయన బుధవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠశాల నుంచి ఎప్పుడు..ఎలా వెళ్లారు అని ఆరా తీశారు. కేసీఆర్ హయాంలో వెలుగొందిన గురుకులాలు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మసకబారుతున్నాయని ఆరోపించారు. విద్యార్థులను సురక్షితంగా తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించాలని కోరారు.

మృతికి సంతాపం

డిండి: మండల పరిధిలోని కందుకూర్ గ్రామానికి చెందిన బర్పటి శిరీష, రహమంతూర్ గ్రామానికి చెందిన ఎలిమినేటి బొందయ్య బుధవారం అనారోగ్య కారణాలతో మృతిచెందారు. వీరి మృతికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ సంతాపం తెలిపారు. మృతదేహాలను సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

ఉపాధ్యాయులతోనే నవసమాజ నిర్మాణం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

- సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి
- ఉత్తమ గురువులకు సన్మానం

హాలియా : నవసమాజ నిర్మాణం ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హాలియాలోని ఓ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు ఒక రోల్ మోడల్ కావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి కట్టుబడి ఉందని, అందులో భాగంగానే విద్యా కమిషన్ ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. విద్యాపరంగా ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకవస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్లు కర్నాటి లింగారెడ్డి, మున్సిపల్ చైర్మన్లు యడవెల్లి అనుపమనరేందర్‌రెడ్డి, అన్నపూర్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్ నాయక్, నాయకులు కాకునూరి నారాయణగౌడ్, కుందూరు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, గౌనీ రాజా రమేష్ యాదవ్, పీఆర్‌టీయూ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు కాలం నారాయణరెడ్డి, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, ఎంఈఓలు బాలునాయక్, రాము పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చేతిలోనే పిల్లల భవిష్యత్తు



సూచనలిస్తున్న హెచ్ఎం నాగేశ్వర్‌నాయక్

కొండమల్లేపల్లి : పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రుల చేతిలోనే ఆధారపడి ఉందని కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నాగేశ్వర్‌రావునాయక్ అన్నారు. బుధవారం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏ విధంగా చదువుతున్నారు. హోం వర్క్ చేస్తున్నారా లేదా అంశాలను పరిశీలించాలన్నారు. సెల్‌ఫోన్లు పిల్లలకు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, గణేష్, సుధాకర్, శోభారాణి, అనురాధ, స్వాతి పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకునేలా ప్రోత్సహించాలి



తిరుమలగిరి(సాగర్): కొంపల్లిలో నిర్వహించిన పోషన్‌అభియాన్‌లో మాట్లాడుతున్న సీడీపీఓ



మిర్యాలగూడ : కాలువపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన పరుస్తున్న హేమాదేవి

మిర్యాలగూడ టౌన్ : గర్భిణులు,బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకునేలా ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమాదేవి అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలం కాలువపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా పోషకాహారం, ఆరోగ్య భద్రతపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఇంద్రపల్లి సైదమ్మ, అహ్మదిబేగం, పంచాయతీ కార్యదర్శి కొప్పుల లావణ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకృష్ణ తదితరులున్నారు.

పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవాలి

డిండి: పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సీడీపీఓ చంద్రకళ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పోషణ మాసాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి పోషణ్ అభియాన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఏసీడీపీఓ ఖాతీజాబేగం, సూపర్‌వైజర్‌లు రేణుకారెడ్డి, రమణ, విజయలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): గర్భిణులు, బాలింతలు పోషకాలు ఎక్కువగా ఉండే వాటిని ఆహారంగా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయశ్రీ అన్నారు. పోషణ్‌మాసంలో భాగంగా బుధవారం మండలంలోని కొంపల్లి రైతువేదికలో నిర్వహించిన పోషణ్ అభియాన్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యాదమ్మ, విజయలక్ష్మీ, ఏఎన్ఎం సరిత, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగమణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీచరు రమేష్, అంగన్‌వాడీ టీచర్లు నారాయణమ్మ, శోభ, రమాదేవి, మణెమ్మ, రేణుక తదితరులున్నారు.